క్లుప్తంగా

జయకుమార్‌కు సన్మానం



జయకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

జ్యోతినగర్: ఏఐసీసీ పరిశీలకుడు, మాజీ ఎంపీ జయకుమార్‌ను గురువారం ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌లో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల్ల చందర్ సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో భాగంగా జయకుమార్, పీసీసీ పరిశీలకుడు వెంకటేశ్, రాజేశ్, కోఆర్డినేటర్ భాసిత్‌లు పీటీఎస్‌లోని అతిథిగృహానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమారస్వామి, రాజకొండ కోటేశ్వర్లు, దుబాసి మల్లేశ్, మధు, దీపక్, అవినాష్, ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, బొద్దున రాజేశంతో పాటు పలువురు సన్మానించారు.

వేధింపులకు గురైతే సమాచారం ఇవ్వండి

పెద్దపల్లిరూరల్: మహిళలు, విద్యార్థినులు పోకిరీల వేధింపుల బారిన పడితే వెంటనే షీటీం సభ్యులకు, డయల్ 100కు లేదా 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని షీటీం ఇన్‌చార్జి ఎస్సై లావణ్య అన్నారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో గురువారం విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్‌నేరాలు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, స్నేహలత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ఉన్నారు. అలాగే పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కాలేజీలో కూడా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ అనంతరెడ్డి, అరుణ్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కుమార్ పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి, సీతంపల్లిలో మండల వ్యవసాయాధికారి అనూష వరిపొలాలను పరిశీలించారు. వరికి సోకిన తెగుల నివారణ గురించి రైతులకు వివరించారు. తెగుల నివారణకు వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

రామగిరి: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో గురువారం రామగిరి ఖిల్లా కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఆహారం ఆరోగ్య నిర్మాణంలో, శ్రేయస్సులో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం శాస్త్రవేత్త డా.బి.నవ్య మాట్లాడుతూ శరీరానికి అవసరమైన అన్ని పోషకాలు, విటమిన్లు అందుకునేలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. 8, 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్పెషల్ ఆఫీసర్ మంజుల, శాస్త్రవేత్తలు డా.వై.వెంకన్న, డా.బి.భాస్కర్‌రావు, డా.కిరణ్ పిల్లి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు అక్కాచెల్లెలు



ఎంపికైన శ్రీనిత్య, మిథాలి

కమాన్‌పూర్: రాష్ట్రస్థాయిలో నిర్వహించే విలువిద్య పోటీలకు అక్కాచెల్లెలు ఎం.శ్రీనిత్య, ఎం.మిథాలి ఎంపికైనట్లు విలువిద్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. రామగిరి మండలం సెంటినరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడా మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంగనర్ జిల్లాస్థాయి అండర్ 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు విలువిద్య పోటీలు నిర్వహించారు. అండర్–14 విభాగంలో ద్వితీయ స్థానంలో శ్రీనిత్య, తృతీయ స్థానంలో మిథాలి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీనిత్య (ఎనిమిదో తరగతి), మిథాలి(ఆరో తరగతి) సెంటినరీకాలనీలో వాణి పాఠశాలలో విద్య అభ్యసిస్తున్నారు. వీరి తండ్రి రమేశ్ కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.

సీపీఆర్‌పై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో గురువారం సీపీఆర్‌పై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ సిరిచందన అవగాహన కల్పించారు. గుండెనొప్పి వచ్చిన వ్యక్తికి సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. ప్రతీరోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. పీహెచ్‌సీ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, నీరజ, ప్రిన్సిపాళ్లు అనుముల పోచయ్య, అయిత శ్రీదేవి, ఏఎన్ఎం సరోజన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు తిప్పలు

- సింగరేణి యాజమాన్యం అద్దె చెల్లించకపోవడంతో బస్సుల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న సెక్టార్–3 సింగరేణి పాఠశాల విద్యార్థులు



పోతనకాలనీ రోడ్డుపై బస్సు కోసం వేచి చూస్తున్న సెక్టార్–3 స్కూల్ విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. కాలనీ, సెంటినరీకాలనీ, పోతనకాలనీ, గోదావరిఖని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులను తరలించేందుకు యాజమాన్యం కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్ల ద్వారా బస్సులు నడిపిస్తోంది. కొన్ని నెలల నుంచి బస్సులకు అద్దెలు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్లు గురువారం బస్సులు నిలిపివేశారు. దీంతో విద్యార్థులు బస్సుల కోసం వేచి చూస్తూ ఇబ్బంది పడ్డారు. ఏఐటీయూసీ యూనియన్ ఆర్జీ–2 ఏరియా అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సాంబశివరావు పిల్లలతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీసం అద్దె బస్సుల బకాయిలు చెల్లించలేని దుస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. సెక్టార్–3 సింగరేణి పాఠశాలకు సంబంధించిన బస్సుల టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి విద్యార్థులకు సరిపడా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా ఇలాంటి సరిస్థితి వచ్చినట్లు గుర్తు చేశారు. ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో పాటు విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

సరిపడా బస్సులు నడపాలి



యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి బస్సులు నడపాలి. అద్దె బస్సులకు చెల్లించాల్సిన బకాయిలను సదరు కాంట్రాక్టర్లకు వెంటనే చెల్లించాలి. అదనంగా బస్సుల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి విద్యార్థులు ఇబ్బంది పడకుండా సింగరేణి యాజమాన్యం స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– సాంబశివరావు, ఏఐటీయూసీ ఆర్జీ–2 అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ



రామగుండం: రామగుండం బైపాస్ నుంచి పట్టణంలోని పోస్టాఫీసు వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భూగర్భంలో ఉన్న తాగునీటి పైపులైన్ పగిలిన క్రమంలో పునరుద్ధరణ పనులు చేపట్టకుండానే మట్టిపై చదును పనులు చేస్తున్నారు. దీంతో తాగునీటి సరఫరా అవుతున్న సమయంలో పగిలిన రంధ్రం నుంచి తాగునీరు లీకేజీ అవుతోంది. విస్తరణ పనులు చేపట్టే క్రమంలో పైపులైన్లు ధ్వంసమైతే తక్షణమే పరిశీలించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బంద్ విజయవంతం చేయాలి



మంథని: నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

పెద్దపల్లి/కమాన్‌పూర్: జిల్లాలో ఈనెల 18న నిర్వహించే బంద్ విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్‌గౌడ్ కోరారు. గురువారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన బీసీ జేఏసీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీమాన్‌తో కలిసి మాట్లాడారు. ఆర్టీసీ, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యాపార సముదాయాలు బంద్‌కు సహకరించాలని కోరారు. గుర్రాల మల్లేశం, బుర్ర శ్రీనివాస్, సాయిరి మహేందర్, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీసీ సంఘాల జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. బంద్‌కు అన్ని వర్గాలవారు సహకరించాలని పిలుపునిచ్చారు. తోట రాజ్‌కుమార్, తాటికొండ శంకర్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వులను నిరసిస్తూ 18న తలపెట్టిన బంద్ విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో విలేకరులతో మాట్లాడారు. బంద్‌కు సహకరించాలని కోరారు. నాయకులు హరికృష్ణ, సంజీవ్, రాజం మహంత, రాజేందర్, సన్నిహిత్, రాకేశ్ ఉన్నారు.

మంథనిలో..

మంథని: బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ 18న ఇచ్చిన బంద్‌లో పాల్గొనాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంథని విద్యార్థి యువత కార్యాలయంలో గురువారం బీసీ జేఏసీ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. బీసీ జేఏసీ నాయకుడు బెజ్జంకి డిగంబర్ అధ్యక్షత వహించగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రామ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండ్ల సమ్మయ్య, జిల్లా కార్యదర్శి గుండోజు ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకుడు కనవేన శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ పట్టణ, మండలశాఖ అధ్యక్షులు సబ్బని సంతోష్, వీరబోయిన రాజేందర్ పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సెప్టెంబర్ వేతనాలు ఇప్పించాలని సెంట్రల్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ వినతి పత్రం అందించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సెంట్రల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటులో 115మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సదరు కాంట్రాక్టర్ ప్రతీనెల 10న వేతనాలు చెల్లించాల్సి ఉన్నా సరిగా చెల్లించడం లేదన్నారు. సదరు కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• డబుల్‌బెడ్రూం ఇళ్లలో ఉండండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు రాంపల్లి రోడ్, చందపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పొందిన లబ్ధిదారులు అక్కడే నివాసముండాలని ఖాళీగా ఉంటే వాటిని రద్దు చేస్తామని కమిషనర్ వెంకటేశ్ తెలిపారు. ఇప్పటివరకు చందపల్లిలో 70, రాంపల్లిలో 50 కుటుంబాలు నివాసముంటున్నట్లు తేలిందన్నారు. నవంబర్ చివరి వరకు ఖాళీగా ఉన్నవాటి వివరాలను కలెక్టర్‌కు నివేదించి ఆదేశాల మేరకు రద్దు చేస్తామన్నారు.

• ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిరూరల్: ఎరుకల కులస్తుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి కోరారు. పెద్దపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పందుల సంఖ్యను తగ్గించాలని వాటిని చంపడం సరికాదన్నారు. నాయకులు రవి, శ్రీనివాస్, సంపత్, రాజయ్య, శివయ్య, సమ్మయ్య ఉన్నారు.

• డ్రగ్స్ నిర్మూలనపై చిత్రలేఖనం పోటీలు

పెద్దపల్లిరూరల్: డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలని ఎస్ఐ నరేశ్ అన్నారు. పెద్దపల్లిలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాల నిర్మూలనపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ మణిదీప్తి ఉన్నారు.

• టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

పెద్దపల్లిరూరల్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కృష్ణమూర్తి, బండ రాజేశం తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ పోటీలు నవంబర్ 15 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 6వ తరగతి చదివే వారి నుంచి ఇంటర్ విద్యార్థులు వివిధ విభాగాల్లో జరిగే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 73969 50725, 90597 30256 నంబర్లను సంప్రదించాలన్నారు.

• పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి కొలనూర్ శివారులో పేకాట స్థావరంపై ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,050 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఎఫ్ఆర్‌వో స్వర్ణలత ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడొద్దని సూచించారు. స్త్రీశిశు సంక్షేమశాఖ సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పాటలు పాడుతూ చైతన్య పరుస్తున్నారు.

• గెజిటెడ్ అధికారుల సంఘం భవనానికి స్థలమివ్వండి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయ భవనం నిర్మించేందుకు అవసరమైన స్థలం కేటాయించాలని కలెక్టర్ శ్రీహర్షకు గురువారం వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఉన్నారు.

• విద్యార్థులకు అభినందన

రామగిరి: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను గురువారం జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బులుసు విష్ణువర్ధన్ అభినందించారు. గత నెలలో కళాశాలలో జరిగిన ఇంటర్నల్ హ్యాకథాన్‌లో కళాశాలకు చెందిన 23 జట్లు పాల్గొనగా 20 జట్లు షార్ట్ లిస్ట్‌కు ఎంపికయ్యాయి. అందులో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్‌కుమార్, కోఆర్డినేటర్ అజ్మీర నరహరి, విభాగాల ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌రావ్, నవ్య, స్నేహ, శివరామకృష్ణ, రవికాంత్, పరిపాలనాధికారి సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

• నగదు రహిత లావాదేవీలపై అవగాహన

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లో గురువారం నగదు రహిత విధానంతో (ఆన్ రిజర్వుడ్ టికెటింగ్ సిస్టం-యూటీఎస్) తమ ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల ద్వారా రైల్వే టికెట్లు పొందే విధానంపై ప్రయాణికులకు అవగాహన కల్పించినట్లు చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ రవికుమార్‌పటేల్ తెలిపారు. డీఆర్‌యూసీసీ ప్రతినిధి శ్రీనివాస్ ఉన్నారు.

• డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు

పెద్దపల్లి: డీసీసీ అధ్యక్షుడి పదవి కోసం దరఖాస్తు చేసినట్లు పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పెద్దపల్లికి చెందిన భూషణవేణి రమేశ్‌గౌడ్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంథని పట్టణంలోని నరసింహ శివకిరణ్ గార్డెన్‌లో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏఐసీసీ అబ్జర్వర్ డాక్టర్ జైకుమార్‌కు జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తూ దరఖాస్తు పత్రం సమర్పించారు.

• చికెన్ సెంటర్ యజమానిపై దాడి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని చికెన్ సెంటర్ యజమానిపై గురువారం రాత్రి యువకులు దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామంలోని నయీం చికెన్ సెంటర్‌కు ముగ్గురు యువకులు వచ్చి చికెన్ కావాలని అడిగారు. చికెన్ ఇవ్వడంలో ఆలస్యం కావడంతో మద్యం మత్తులో యువకులు.. నయీం, అతడి తమ్ముడు రషీద్‌పై చికెన్ కొట్టే కత్తులతో దాడి చేయగా, తీవ్రగాయాలయ్యాయి.

ఉప్పులేటి రాధాకృష్ణ ఆశయాలు కొనసాగిద్దాం

ఫెర్టిలైజర్‌సిటీ: ఉప్పులేటి రాధాకృష్ణ ఆశయాలను కొనసాగిద్దామని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ రాజమల్లు అన్నారు. రామగుండం కార్పొరేషన్ ఖాజిపల్లిలో గురువారం కార్పొరేషన్ కమిటీ కార్యదర్శి ఉప్పులేటి రాధాకృష్ణ మృతికి సంతాపంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి పూలమాల నివాళి అర్పించారు. కిషన్ నాయక్, వై.యాకయ్య, వేల్పుల కుమారస్వామి, ఎ.ముత్యంరావు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.మహేశ్వరి, రామాచారి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పశు సంతతిని కాపాడుకుందాం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పాడి పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు రోగాల బారిన పడకుండా కాపాడుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గురువారం పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో మెగా పశువైద్య శిబిరాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విజయభాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పశువులు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించి రోగాలు నియంత్రించుకోవాలని పెంపకందారులకు సూచించారు. ఏడీ శ్రీదేవి, వైద్యులు వేణుగోపాలరావు, పశుగణన అధికారి సత్యప్రసాద్‌రెడ్డి, అఖిల్‌రాజు, అనిల్‌కుమార్, సురేశ్, రవి, గోపాలమిత్రలు చంద్రయ్య, శ్రీనివాస్, రవీందర్, మనోహర్, లక్ష్మణ్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఓదెల: మండలంలోని కొలనూర్, గోపరపల్లె గ్రామాల్లో ఇటీవల పలువురు మృతిచెందారు. బాధిత కుటుంబాలను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, నాయకులు పాకాల కరుణాకర్‌రెడ్డి, దొడ్డె స్వామి ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు పదోన్నతి కల్పించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు సెమీస్కిల్డ్ ఇవ్వాలని, సెమీస్కిల్డ్‌లో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. స్కిల్డ్‌లో పనిచేస్తున్న కార్మికులకు హైస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన భూమయ్య, బండారు శ్యాంసుందర్, చిగురు లక్ష్మణ్, గొడుగు సమ్మయ్య, గూడెపు వినోద్, సుంకరి సురేశ్, సాయిభరత్, భూసారపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి విరాళం

మంథని: మాతృదేవోభవ మానసిక దివ్యాంగుల అనాథాశ్రమానికి రూ.16వేలు అందించినట్లు మంథనికి చెందిన ఎంఆర్ గ్రూపు వ్యవస్థాపకుడు డాక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆశ్రమం ఆధ్వర్యంలో చేస్తున్న భూదన్ యజ్ఞంకు తమవంతు సహకారం అందించినట్లు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు పవన్, హర్షవర్ధన్ ఉన్నారు.

సహకార బ్యాంకులో మహిళలకు ప్రత్యేక డిపాజిట్ పథకం

మంథని: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా దీపావళి కానుకగా మహిళలకు అందిస్తున్న సౌభాగ్యలక్ష్మి ప్రత్యేక డిపాజిట్ పథకంతో మహిళల ఇంటికి సౌభాగ్యం చేకూరుతుందని మంథని బ్రాంచ్ మేనేజర్ ఉదయశ్రీ అన్నారు. డిపాజిట్ సేకరణలో భాగంగా గురువారం పట్టణంలోని పలు వీధుల్లో సహకార బ్యాంకు మేనేజర్ ఉదయశ్రీ, బ్యాంకు, సహకార సంఘం సిబ్బంది డిపాజిట్లపై ప్రచారం చేశారు. బ్యాంకు డీఈ సందెబోయిన శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్లు పోతరాజు సతీశ్, బూడిద వసంత, సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



అభినందిస్తున్న మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన రుక్షిత్, అజ్జన్న, వర్షిత్, రాజేశ్వరి జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కాగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి వీరిని అభినందించారు. 18, 19వ తేదీల్లో కోరుట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

హెచ్‌ఆర్‌డీ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ కార్పొరేట్ హెచ్ఆర్‌డీ జీఎంగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ మేరకు గురువారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎం లలిత్‌కుమార్ ఆయనను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, ఏరియా ఇంజినీర్ రామ్మోహన్, ఏజెంట్ ఎల్.రమేశ్, ఏరియా రక్షణ అధికారి సాయిప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్ర ద్వారా సీఎంను కలుస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డిపెండెంట్లు

గోదావరిఖని: నవంబర్ చివరినాటికి మారుపేర్ల డిపెండెంట్ల సమస్య పరిష్కారం కాకుంటే పాదయాత్ర ద్వారా బయలుదేరి సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని మారుపేర్ల బాధితులు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు జోక్యం చేసుకుని డిపెండెంట్ల సమస్య పరిష్కరించాలన్నారు. సంబంధిత మంత్రులతో సమావేశమై మారుపేర్ల కార్మికుల పిల్లలకు ఉద్యోగం వచ్చేలా చూడాలన్నారు. శ్రవణ్ జక్కు, డబ్బేట అంజయ్య, గాలివీడు రాజయ్య, గుర్రం సుధాకర్, ఓంప్రకాశ్, ఈర్ల రాజయ్య, పుట్ట సత్యం, వేముల ప్రదీప్‌వర్మ, మోతుకూరి రవికుమార్, హరీశ్‌కుమార్, డిష్ బాబు, వంగ సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్, ఇంజినీరింగ్ యూనియన్ మండల అధ్యక్షుడిగా జహీర్



ధర్మారం: ఎలక్ట్రికల్స్ అండ్ ఇంజినీరింగ్ ఓనర్స్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా ఎండీ జహీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గురువారం యూనియన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓనర్లు, వర్కర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా ఎండీ జహీర్, ప్రధాన కార్యదర్శిగా రాము, ఉపాధ్యక్షుడిగా వెల్మ మల్లారెడ్డి, ప్రచార కార్యదర్శిగా సుతారి రవి, కోశాధికారిగా అమరేందర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, సామ మల్లారెడ్డి, కుమార్, రాజేందర్, వెన్నం సాగర ఆంజనేయులు, సుధాకర్, రవి, శ్రీనివాస్, నేరేళ్ల కిరణ్‌కుమార్, బ్రమచారి, సదానందం, సంతోష్, చంద్రమౌళి, అరుణ్‌ను ఎన్నుకున్నారు.

వైకే ఫౌండేషన్ సభ్యుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం గురువారం కరీంనగర్ ప్రతిభ ఆసుపత్రిలో వైకే ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేశారు. ప్రతీనెల తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదానం చేస్తున్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కండెం సురేశ్ సంస్థ సభ్యులైన గూడ వినయ్‌కుమార్‌కు రక్తదానం చేయాలని సూచించారు. స్పందించిన వినయ్‌కుమార్ మరో నలుగురితో కలిసి కరీంనగర్‌లోని ప్రతిభ ఆసుపత్రిలో రక్తదానం చేశారు. వినయ్‌తో పాటు రక్తదానం చేసిన మిగతా సభ్యులు రాకేశ్, రవీందర్, రాజు, సదానందంను సంస్థ అధ్యక్షుడు సురేశ్, గౌరవ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ సంస్థ సభ్యులు అభినందించారు. వినయ్ కుమార్ మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 28సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.

విల్లంబు ఎక్కుపెట్టి..



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీకాలనీ రాణిరుద్రమదేవి క్రీడాప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఆర్చరీ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు వంద మంది క్రీడాకారులు అండర్–14,17,19 విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు కరీంనగర్ ఉమ్మడి జిల్లా టీం నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సీసీ రోడ్ల నాణ్యత తనిఖీ



స్టాండర్డ్ కోర్ కటింగ్ చేస్తున్న ఆర్అండ్‌బీ టీం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల మేరకు, ఆర్అండ్‌బీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల వరుసగా సీసీరోడ్ల నాణ్యతపై కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీకి ఫిర్యాదులు వచ్చాయి. పలు చోట్ల స్టాండర్డ్ కోర్ కటింగ్ చేసిన టీం, వాటి నాణ్యత పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు సేకరించిన శాంపిళ్లను తరలించారు. పరీక్షల అనంతరం నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు నివేదించనున్నారు.